# సత్యం మందపాటి చూపిస్తున్న

# విహార యాత్రా స్పెషల్!

అలాస్కా
నయాగరా
గ్రాండ్ కాన్యన్
హవాయీ
బార్సిలోనా
రోమ్
వెన్నిస్
పారిస్
జపాన్
సింగపూర్
చైనా
జర్మనీ
స్విట్జర్లాండ్
ఇజ్రాయిల్
తైవాన్
ఇండియా
ఇంకా ఎన్నో...



"Our World at your finger tips"

# విహార యాత్రా స్పెషల్!

## సత్యం మందపాటి

ట్రావెలాగులు

తెలుగు సాహిత్య సౌరభం

గుంటూరు హైదరాబాద్ ఆస్టిన్

**Telugu Sahitya Sourabham**

**Guntur, Hyderabad and Austin, TX (USA)**

Vihara Yatra Special

Publication No. 13

June, 2016

Copy Right: Satyam Mandapati

Typesetting: Satyam Mandapati

Cover Page: Satyam Mandapati

Writers email address: satyam_mandapati@yahoo.com

E-Book Released Through: www.kinige.com

Rs. 80

# ప్రేమయాత్రలకు బృందావనమూ..

ఇప్పుడు ప్రేమయాత్రలకి నా వయసు కుసింత ఎక్కువైనట్టుంది. అక్కడ ప్రత్యేకమైన విశేషాలు ఏమైనా వుంటే తప్ప తీర్ధయాత్రలకి మనసెప్పుడూ లేదు. అయినా ఎన్నో విహార యాత్రలు, మరెన్నో వినోద యాత్రలు, ఆఫీసు పని మీద చాల వ్యాపార యాత్రలు చేశాను. కొన్ని ఒంటరిగా ఏకో నారాయణా అనుకుంటూ, కొన్ని అర్ధాంగితో కలిసి లాహిరి లాహిరి పాడుకుంటూ, కొన్ని కుటుంబ సభ్యుల సపరివార సమేతంగా, కొన్ని మిత్రులతో సరదాగా, కొన్ని 'కొలీగుల'తో దేశవిదేశాలు.

లాగులు తొడుక్కునే ప్రతివాడూ ట్రావెలాగులు వ్రాస్తూనే వున్నాడు మళ్ళీ నేనెందుకు వ్రాయటం అనుకున్నాను ముందు. కానీ 'ఎవరి లాగులూ, ట్రావెలాగులూ వాళ్ళవే కదా, మీరూ వ్రాయండి' అన్నారు మిత్రులు. సరే అలాహే కానివ్వండి అని 'విహార యాత్రా స్పెషల్' అనే ఈ శీర్షిక 'సారంగ' అంతర్జాల పత్రికలో వ్రాశాను. వీటిలో కొన్ని 'ఆంధ్రభూమి'లోనూ, 'సుజనరంజని'లోనూ ప్రచురింపబడ్డ నా వ్యాసాలకు కొంచెం మెరుగుపెట్టి తిరగ వ్రాసినవి. ఈ మూడు పత్రికల సంపాదకులకూ ధన్యవాదాలు.

మీరీ ప్రదేశాలకు వెళ్ళాలనుకుంటుంటే, నా వ్యాసాలు వాటి గురించి మరి కొంచెం అవగాహనని పెంచుతాయని నా ఉద్దేశ్యం. ఇతర కారణాల వల్ల, ఆ ప్రదేశాలకి వెళ్ళొద్దులే అనుకుంటే ఏమీ ఫరవాలేదు, అక్కడికి వెళ్ళినంత సరదాగా, ఆనందంగా ఈ వ్యాసాలు చదువుకోండి! మీ కోసం కొన్ని ఫోటోలు కూడా జత చేస్తున్నాను మరి!

సత్యం మందపాటి

# ఇందులో..


1. ఈసారికి అలాస్కానిచ్చాం!
2. కేనరీ ద్వీపాలు
3. బార్సిలోనా..లోనే!
4. రోమ్!
5. వెన్నెల్లో వెన్నిస్!
6. ఫ్లొరెన్స్ టు పీసా!
7. ఇష్ లిబె దీష్!
8. నయాగరా జలపాతం
9. న్యూఢిల్లీలో గాంధీ
10. ప్యారీ.. ప్యారీ.. పారిస్!
11. కోణార్క్ శిల్ప కళా వైభవం
12. అలోహా.. హవాయీ..
13. తెల్లటి నుదుటి మీద నల్లటి మచ్చ!
14. వనరులు – వనాలు
15. జయహో జైపూర్
16. జపాన్
17. ఇజ్రాయిల్
18. తైవానుభవం
19. హాయ్.. హాయ్.. షాంఘాయ్
20. సింగపూరు సింగారం
21. గ్రాండ్ కాన్యన్
22. విల్కోమెన్
23, వివా లాస్ వెగాస్!

# ఈసారికి అలాస్కానిచ్చాం!

"మూర్తిగారూ! మనం ఈ సంవత్సరం అలాస్కాకి వెడదామనుకున్నాం. మరి ప్లాన్ చేద్దామా?" అడిగాను ఫోనులో.

ఆయన ఎప్పుడు కాదన్నారు కనుక, "అలాగే వెడదాం! నేను కొన్ని వివరాలు కనుక్కున్నాను కూడాను. మే నెలలో కానీ అలాస్కా వెళ్ళటానికి వీలులేదు. అప్పటిదాకా చలి, మంచు. అదీకాక అక్కడ నేషనల్ పార్కులన్నీ తెరిచేటప్పటికీ మే నెల వచ్చేస్తుందిట. మళ్ళీ సెప్టెంబరు చివరి వారంలో పార్కులన్నీ మూసేస్తారుట" అన్నారు మూర్తిగారు.

"అయితే ఎప్పుడు వెడదాం?" అడిగాను.

"మే చివరి వారం నించీ జూన్ మధ్య దాకా కానీ, ఆగస్టు చివరి వారం నించీ సెప్టెంబరు చివరి వారం లోపల అయితే, క్రూజ్ లో కొంచెం చవక. వాతావరణం కూడా బాగానే వుంటుంది"

వెంటనే వెడదామనుకున్న ఆరుగురం, తర్వాత నెలరోజుల్లోపల గూగులమ్మ, అంతర్జాలయ్యల సహకారంతో, తెలిసిన ట్రావెల్ ఏజెంట్ సహాయంతో, మా ట్రిప్ అంతా ప్లాన్ చేసేశాం. ఇక అలాస్కా వెళ్ళటమే తరువాయి.

o o o

ఈ వ్యాసం వ్రాయటానికి ఒక కారణం కూడా వుంది. మేము అలాస్కా వెళ్లి తిరిగి రాగానే, ముఖ పుస్తకంలో మా

అలాస్కా విహారయాత్ర చాల బాగుంది అని వ్రాస్తూ, అక్కడి ఎంతో చక్కని నీలం రంగు గ్లేషియర్ ఫోటో ఒకటి పెట్టాను. వెంటనే నా గూఢ మిత్రులూ, గాఢ శత్రువులూ అందరూ బోలెడో, బొచ్చెడో 'లైకులు' కొట్టేశారు. అలా కొట్టేసి వూరుకోకుండా, మీ ప్రయాణ విశేషాలు ఒక ట్రావెలాగులా వ్రాయకూడదూ అని మర్యాదగా పురమాయించారు. లాగులు వేసుకునే ప్రతివాడూ ట్రావెలాగులు వ్రాస్తున్నాడు, మళ్ళీ నేనెందుకు వ్రాయటం అనుకున్నాను ముందు. కాని మిత్రులూ, శత్రువులూ ససేమిరా అన్నారు. ఆ మాటకి అర్ధం కాస్తో కాస్తో తెలుసు కనుక, సరే అని ఈ వ్యాసంతో మొదలుపెట్టేస్తున్నాను.

ం ం ం

నాలుగైదు మీటింగులు పెట్టేసి, మీటింగుల్లో వేడివేడి మిరపకాయ బజ్జీలు తినేసి, చివరికి మా ప్రయాణ వివరాలు తయారు చేసుకున్నాం. ఆగస్టు నెల చివరిలో ఆస్టిన్ నించీ లాసాంజలీస్ మీదుగా అలాస్కాలోని ఆంకరేజ్ అనే వూరికి విమానయానం. అక్కడ ఒక రాత్రి వుండి, తర్వాత బస్సులో మౌంట్ మెక్కిన్లీకి వెళ్లి అక్కడి రిసార్టులో రెండు రాత్రులు, తర్వాత మళ్ళీ బస్సులో డెనాలి నేషనల్ పార్క్ వెళ్లి అక్కడ రిసార్టులో ఇంకో రెండు రాత్రులు. పెళ్లి అవగానే మూడు నిద్రల లాగా ఇది ఐదు నిద్రల రోడ్డు ప్రయాణం. తర్వాత అక్కడినించీ రైల్లో ఆంకరేజ్ మీదుగా విట్టియర్ అనే వూరు వెళ్లి, అక్కడి నించీ ఏడు రాత్రుల క్రూజ్ తీసుకుని, కెనడాలోని వాంకూవర్ రావటం. అక్కడినించీ సెప్టెంబర్ నాలుగున పుష్పకవిమానంలో మా వూరికి తిరుగుప్రయాణం.. క్లుప్తంగా ఇవి మా ప్రయాణ కార్యక్రమ వివరాలు.

ం ం ం

అలాస్కా, మొదట్లో రష్యా దేశంలో, దేనికీ పనికిరాని ఒక చలి ప్రదేశంగా వుండేది. రష్యా నించీ 1867లో అమెరికా అలాస్కాని ఏడు మిలియన్ల డాలర్లకి కొనుక్కుంది. అంటే ఒక్కొక్క ఎకరం రెండు సెంట్లు మాత్రమే. అంటే ఒక డాలరుకి యాభై ఎకరాలు. ఏమీ పనికిరాని ఆ చలి + కొండ ప్రదేశానికి అంత డబ్బు రాగానే, రష్యా వాళ్ళు భలే మంచి చౌక బేరమూ అని పాడుకున్నారు. కానీ 1890లో అమెరికా అక్కడ టన్నుల కొద్దీ బంగారం వుందని కనుక్కున్నది. ఒక మంచు కొండంత బంగారం కనపడగానే భలే మంచి చౌక బేరమూ అనే ఆ పాటని రష్యన్లని పాడటం ఆపేయమని చెప్పి, అమెరికన్లు పాడుకోవటం మొదలుపెట్టారు. అలాస్కాని 1959లో 49వ రాష్ట్రంగా అమెరికాలో చేర్చేశారు. సాంకేతికంగా ఎంతో ముందున్న అమెరికా, అరేబియన్ దేశాల్లో ఇసకలోనించీ తైలం తీయటమే కాక, అలాస్కాలోని మంచు నీళ్ళల్లో నించీ కూడా పెట్రోలు తీయటం మొదలుపెట్టింది. అంతేకాక అలాస్కాని ప్రపంచం మొత్తం మీద ప్రతి ఒక్కరూ చూడవలసిన ఒక గొప్ప విహార స్థలంగా తీర్చిదిద్దింది.

సంవత్సరానికి ఎనిమిది నెలలు అలాస్కాలో విపరీతమైన చలి. ఉష్ణోగ్రత ఫ్రీజింగ్ పాయంటుకి క్రిందనే వుంటుంది. మైనస్ నలభై డిగ్రీలు మామూలే. మైనస్ ఎనభై డిగ్రీల దాకా అప్పుడప్పుడూ వెడుతూ వుంటుంది. ఏటేటా సగటున ఎనభై అడుగుల దాకా మంచు పడుతుందిష! సూర్య భగవానుడు ప్రొద్దున్న పదకొండు గంటలకి అలా షికారుగా వచ్చి, ఒక నాలుగు గంటలు వుండి వెళ్ళిపోతాడు. అందుకని ఎవరు బయట ఏ పని చేసుకోవాలన్నా ఆ నాలుగు గంటల్లోనే పూర్తిచేసుకోవాలి. లేకపోతే అంతా చీకటే. ఇహ చందమామ పాటలు ఇరవై గంటలు పాడుకోవచ్చు. సూర్య నమస్కారాలు మాత్రం కేవలం నాలుగు గంటలే! అదే వేసవి కాలంలో

అయితే, చందమామ రావే పాట పాడుకోవటానికి మూడు-నాలుగు గంటల సమయం మాత్రమే వుంటుంది. మూడు గంటలు తప్ప మిగతా రాత్రి అంతా వెలుతురే మరి. అలాస్కాని అర్ధరాత్రి సూర్యుడు వుండే ప్రదేశం (Land of the Midnight Sun) అంటారు. మేము వెళ్ళిన సమయం వేసవి కాలం చివరి నించీ ఆకులు రాలే కాలం మొదలయే ముందు కనుక, పగటి సమయం పగలుగానూ, రాత్రి సమయం రాత్రిగానూ మామూలుగా వుండి మమ్మల్ని భయపెట్టలేదు.

ఇహపోతే.. అలస్కా అమెరికాలోకెల్లా అతి పెద్ద రాష్ట్రం. వైశాల్యం 665,000 చదరపు మైళ్ళు. అంటే దాదాపుగా ఇండియాలో సగం. జనాభా ఏడు లక్షల చిల్లర. అంటే మా గుంటూరు నగర జనాభాలో దాదాపు సగం. ఒక్క ఆంకరేజ్ నగరంలోనే మూడు లక్షల జనాభా వున్నారు. మిగతా అలాస్కా అంతా కలిపితే నాలుగు లక్షల జనాభా!

అలాస్కా భూకంపాలకి నిలయం. సగటున సంవత్సరానికి ఐదు వేల భూకంపాలు వస్తాయని చెప్పారు. ఒక అతి పెద్ద భూకంపం 1964లో, 9.2 స్కేలులో వచ్చి అలాస్కాని ఒక వూపు వూపింది. అలాగే అగ్నిగుండాలు (Volcanoes) కూడా తక్కువేమీ కాదు.

ఇవన్నీ ఒక వేపు.. అలాస్కా అందాలు ఇంకొక వేపు.

ప్రపంచంలో అతి సుందరమైన, రంగురంగుల ప్రదేశం అలాస్కా.

o o o

మా ప్రయాణ విశేషాలు ఒక డైరీ లాగా కాకుండా, చెప్పుకోదగ్గవి విషయపరంగా, క్లుప్తంగా చెప్పుకుందాం.

ఆంకరేజ్ చాల శుభ్రమైన చిన్న వూరు. ఎక్కడ చూసినా విరిసిన పూల మొక్కలతో ఎంతో అందంగా వుంది. ఇక్కడ ఆశ్చర్యం వేసిందేమిటంటే, అలాస్కాలో చాల ప్రదేశాల్లో, ఏ మొక్కగానీ, చెట్టుగానీ పచ్చగా వుండేది మూడు నెలలే – జూన్, జులై, ఆగష్టు. అయినా సమయానుగుణంగా పూలు విరగ పూస్తున్నాయి, కాయగూరలు కాస్తున్నాయి. పూల రాలిపోగానే, ఆకులు రంగులు మారిపోతాయి. ఎరుపు, గోధుమరంగు, పసుపు,.. తర్వాత ఎక్కడ చూసినా తెల్లటి తివాచీలు పరిచినట్టు మంచు.

తర్వాత మౌంట్ మెక్కిన్లీకి రోడ్డు ప్రయాణం కూడా కొండలమధ్య నించీ వెడుతుంటే మనోహరంగా వుంది.

మా బస్సు వసిల్లా అనే వూరు మీదుగా వెడుతున్నప్పుడు, నిర్మల అడిగింది "ఇక్కడే కదూ.. శారా పాలిన్ వుండేది" అని.

వైస్ ప్రెసిడెంట్ పదవికి నిలబడి, చతికిలపడిన ఆవిడే శారా పాలిన్.

"అవును. ఇక్కడే! పాపం!" అన్నారు రత్నగారు నవ్వుతూ.

నేను బస్సు కిటికీలోనించీ అటూ ఇటూ తేరిపార చూశాను, శారా పాలిన్ చెప్పినట్టు ఆవిడ ఇంటి వెనుక వున్న రష్యా దేశం కోసం. ఉందేమో.. కానీ నా కళ్ళజోడు కళ్ళకి మాత్రం రష్యా కనపడలేదు అక్కడ!

అప్పుడే చెబుతున్నాడు గైడ్ వేషం వేసుకున్న మా బస్ డ్రైవర్, "ఇక్కడ అమ్మినన్ని డక్ట్ టేపులు ప్రపంచంలో ఎక్కడా అమ్మరు, ఇది ప్రపంచంలో ఒక రికార్డు" అని.

అతను హాస్యానికి అనలేదు ఈ మాటలు. భయంకరమైన ఆ చలికి నీళ్ళ పైపులు పగిలిపోవటం అక్కడ చాల ఎక్కువ. అందుకని డక్ట్ టేపులు డజన్ల కొద్దీ కొని, ఆ పైపుల చుట్టూ దట్టంగా

చుట్టుతుంటారు. అది కూడా ఒకసారి కాదు. ప్రతి సంవత్సరం ఎన్నోసార్లు. అక్కడ హోండిపో, వాల్మార్ట్ షాపుల్లో ఎక్కువగా అమ్మేది కూడా డక్ట్ టేపులేనుష!

మౌంట్ మెక్కిన్లీ పార్కుకి వెళ్ళగానే మమ్మల్ని ఆహ్వానించింది పెద్ద వాన. ఎడతెరిపిలేకుండా మేము అక్కడ వున్న రెండు రోజులూ, ఏనాటి అనుబంధమో కానీ, మాతోనే అంటిపెట్టుకుని వుంది. అయినా ఆ వాన చినుకుల్లో ఆ కొండ ప్రదేశపు అందాలను ఆస్వాదిస్తూ, ఎదురుగా వున్న ఎత్తైన మౌంట్ మెక్కిల్నీని చూస్తూ, మధ్యే మధ్యే ఆ చిటపట చినుకుల్లో కొంత హైకింగు కూడా చేశాం. మేము దిగిన రిసార్టు కూడా, అంతా చెక్కలతో కట్టిన కేబిన్లతో ఎంతో చక్కగా వుంది.



మౌంట్ మెక్కిన్లీ పర్వతం ఎత్తు సగటు సముద్రమట్టం నించీ 20,237 అడుగులు. ఉత్తర అమెరికాలో ఎత్తైన పర్వతం. ప్రపంచంలో మూడవ ఎత్తైన పర్వతం. మొదటిది టిబెట్ దేశంలోని ఎవరెస్ట్ పర్వతం, రెండవది ఆర్జెంటీనా, దక్షిణ అమెరికాలోని ఎకాన్కావా

పర్వతం. ఇక్కడ కూడా కొన్ని అభ్యంతరాలున్నాయి. ఎకాన్కావా పర్వతం కొంత నీటిలో వుండటం వల్ల, సముద్రమట్టం నించీ అది మౌంట్ మెక్కిన్లీ కన్నా ఎత్తు తక్కువ. అలాగే ఎంతో ఎత్తులో వున్న టిబెట్ పీఠభూమి మీద వున్న ఎవరెస్ట్ పర్వతం ఎత్తు కూడా టిబెట్ పీఠభూమి నించీ కాకుండా, సముద్రమట్టం నించీ లెఖ్ఖ వేయటం వల్ల, అది మౌంట్ మెక్కిన్లీ కన్నా ఎత్తు తక్కువ అనే వాదం కూడా వుంది. కాకపోతే సముద్రమట్టం నించీ చూస్తే మౌంట్ మెక్కిన్లీ ప్రపంచంలోనే, ఎవరెస్ట్ తర్వాత, రెండవ ఎత్తైన పర్వత శ్రేణి.

ఇక్కడ ఎంతో చెప్పుకోదగ్గ విశేషం, 'ఉత్తరాది ఆకాశ రంగుల దీపావళి'. దీన్నే ఇంగ్లీషు వాళ్ళు నార్తరన్ లైట్స్ అంటారు. ఇది అలాస్కాలో, మేము వెళ్ళిన ప్రదేశాలకన్నా ఉత్తరాన వున్నా ఫెయిర్ బాన్క్స్ అనే నగరంలోనూ, ఇంకా ఉత్తరాన కనపడుతుంది. ఆగష్టు నెలాఖరి నించీ ఏప్రిల్ మొదటివారం దాకా రాత్రిపూట ఆకాశం రంగులు పులిమేసిన ఒక చిత్రపటంలా, ఆ రంగులు రకరకాల రూపాలను సంతరించుకుంటూ వెలిగిపోతుంది. ఇది అలాస్కాలోనూ కెనడాలోనూ, నార్వేలోనూ, ఇంకా నార్త్ పోలుకి దగ్గరగా వున్న ఇతర దేశాల్లోనూ కనపడుతుంది. కాకపోతే అవి ప్రతి రోజూ కనపడవు. వాటికీ ఏవో గ్రహాల కదలిక, వాతావరణం కలిసిరావటం వంటివి వున్నాయి. అయినా మా హోటల్ ఫ్రంట్ డస్క్ అమ్మాయికి మా గది నెంబర్లు ఇచ్చి, ఒకవేళ ఆ ఆకాశపు రంగులు కనిపిస్తే మమ్మల్ని లేపి చెప్పమన్నాం. రాత్రి రెండు గంటలకి అవి కనపడితే కనపడవచ్చు, అలా కనపడితే నేను చెప్పకుండా వుంటానా అంది ఆ బంగారం జుట్టు తెల్ల పిల్ల. ఇక్కడే కాదు మేము తర్వాత వెళ్ళిన డెనాలిలో (తెనాలి కాదు) కూడా అదే చేశాం. కాని మా దురదృష్టం. అంత గొప్ప ప్రకృతి విన్యాసాన్ని ప్రత్యక్షంగా చూడలేకపోయాం.

తర్వాత అక్కడే దాని మీద ఒక సినిమా చూశాం. మనం మామూలుగా చూడలేని ఒక మనోహరమైన దృశ్యతోరణం అది. ఈ వ్యాసం చదువుతున్న మిత్రులందరికీ ఒక అభ్యర్ధన. మీరు “Northern Lights” అని వ్రాసి గూగులమ్మ సహాయంతోనో, యూట్యూబువారి సహకారంతోనో ఏవయినా విడియోలు లేదా నిశ్చలన చిత్రాలు దొరికితే చూసితీరండి. నేనేం చెబుతున్నానో మీకే తెలుస్తుంది.

ఆ తర్వాత మేము వెళ్ళింది డెనాలి నేషనల్ పార్క్. అక్కడ రిసార్టుకి వెళ్ళగానే, చిరుజల్లులు వచ్చినా, మిగతా రెండు రోజులూ వాతావరణం చాల బాగుంది. 56 డిగ్రీల ఫారన్హీట్ (13 డిగ్రీల సెంటీగ్రేడ్) నించీ 60 డిగ్రీల ఫారన్హీట్ (15 డిగ్రీల సెంటీగ్రేడ్) వరకూ, చిరు వెచ్చని ఎండ శరీరాన్ని తాకుతుంటే, ఒక చిన్న స్వెట్టర్/జాకెట్ వేసుకుంటే హాయిగా వుంది.

మరచిపోయాను, ఇంకో విషయం చెప్పాలి. ఆంకరేజ్, ఫెయిర్ బాన్క్స్, జూనో మొదలైన కొన్ని వూళ్ళు తప్పితే, అలాస్కా అంతా – మెక్కిన్లీ, డెనాలిలతో సహా, మే నెల చివరిలో (ఇరవై నాలుగో తారీఖు అని గుర్తు) తెరిచి, సెప్టెంబర్ ఇరవై నాలుగున మూసేస్తారు. మూసేయటం అంటే నిజంగా తాళాలు వేసేసి, బుడుగు భాషలో నిఝంగా ఊళ్ళకి వూళ్ళే మూసేయటం అన్నమాట. మే నెలలో అందరూ తిరిగిరాగానే, అంతా శుభ్రం చేసుకోవటం కన్నా పెద్ద పని, పగిలిపోయిన పైపుల్ని బాగుచేసుకోవటం!

రోడ్డు దాటితే ఎన్నో షాపులు. విశేషమేమిటంటే అక్కడ పని చేయటానికి వచ్చిన వాళ్ళు చాల మంది పాత సోవియట్ యూనియన్ దేశాల వారే. అమెరికాలోని చాల నగరాలకన్నా, అవే

దగ్గర మరి. ఎక్కువమంది వేసవి సెలవలకి ఉద్యోగాల కోసం వచ్చిన విద్యార్థులు.

ఇక్కడ చెప్పుకోదగ్గది మేము వెళ్ళిన డెనాలి పార్క్ 'టుండ్ర విల్డర్నెస్ టూర్'. బస్ ప్రయాణం. ఆ ప్రకృతి అందాలని మాటల్లో చెప్పటం కష్టం. వాతావరణం బ్రహ్మాండంగా వుంది. దారిలో దగ్గరనించీ ఎన్నో ఎలుగుబంట్లని చూశాం, మూస్ లని, కరీబులని చూశాం. టార్మిగాన్ పక్షులని చూశాం, డాల్ గొర్రెల్ని చూశాం. అన్నిటికీ మించి రెండు కొండలనీ కలుపుతూ వున్నపెద్ద ఇంద్ర ధనస్సుని చూశాం. మధురాతి మధురం అంటే అదేనేమో! మా డ్రైవర్ "ఎప్పుడో కానీ వీటన్నిటినీ ఒకే ట్రిప్పులో చూడటం సాధ్యం కాదు, మీరు అదృష్టవంతులు" అన్నాడు.



మర్నాడు స్లెడ్ బండ్లను లాగే కుక్కలు వున్న చోటుకి వెళ్ళాం. చూడటానికి ఎంతో భయంకరంగా వున్నా, మనం వాటిని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vihara+Yatra+Special**

* * *